# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 20-02-2016**

ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేయడానికి ఎన్ని నిధులైనా విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి నిమ్స్ వరకు ఏ ఆసుపత్రికి ఏమి చేయాలనే విషయంలో సమగ్ర నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు చెప్పారు. బడ్జెట్ సమీక్షల్లో భాగంగా శనివారం ఉదయం వైద్య, ఆరోగ్య శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజెందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి బిపి ఆచార్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి తివారి, ఆర్థిక శాఖ కార్యదర్శులు రామకృష్ణ రావు, శివశంకర్, సమాచార శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, సిఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు, అదనపు ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, సిఎం ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలు పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచడానికి, ఆసుపత్రుల్లో పడకలు, విద్యుత్, టాయిలెట్లు, బెడ్ షీట్లు సరైన రీతిలో ఉండేట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బెడ్ షీట్లను ఎప్పటికప్పుడు మార్చాలని, వాటిని శుభ్రం చేయడానికి మెకనైజ్డ్ లాండ్రీ సిస్టమ్ ఉండాలన్నారు. పాత భవనాల స్థానంలో కొత్తవి నిర్మించాలని సూచించారు. హైదరాబాద్ లో ప్రస్తుతమున్న గాంధీ, ఉస్మానియాలకు తోడుగా మరో నాలుగు వెయ్యి పడకల ఆసుపత్రులను నిర్మించాలని, అందుకు అనువైన స్థలాలు ఎంపిక చేయాలని చెప్పారు. ఉప్పల్ - ఎల్ బి నగర్ ప్రాంతాల్లో ఒకటి, మల్కాజిగిరి - కంటోన్మెంట్ ప్రాంతాల్లో ఒకటి, కుత్బుల్లాపూర్ - కూకట్ పల్లి ప్రాంతాల్లో ఒకటి, శేరిలింగంపల్లి - రాజేంద్రనగర్ ప్రాంతాల్లో ఒకటి చొప్పున మొత్తం నాలుగు పెద్ద ఆసుపత్రులు నిర్మించాలన్నారు. కింగ్ కోటి ఆసుపత్రి స్థాయి కూడా పెంచి మల్టి స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చాలని సూచించారు. నగరంలోని ఈ ఏడు ఆసుపత్రుల్లో వుమెన్ అండ్ చైల్డ్ కేర్ తో పాటు ఇతర అన్ని రకాల వైద్య సేవలు అందించాలని చెప్పారు. వరంగల్ ఎంజిఎం ప్రస్తుత భవనంలో వుమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కోసం ప్రత్యేకంగా టవర్స్ నిర్మించాలని, హెల్త్ యూనివర్సిటీకి అనుబంధంగా మల్టి స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని చెప్పారు. వరంగల్ లో హెల్త్ యూనివర్సిటీ, మెడికల్ కాలేజీ, మల్టి స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రస్తుతమున్న సెంట్రల్ జైలు ప్రాంతంలో నిర్మించనున్నట్లు చెప్పారు. కరీంనగర్,

ఖమ్మం, సూర్యాపేట ఆసుపత్రులను అప్ గ్రేడ్ చేసి కొత్త భవనాలు కట్టిస్తామన్నారు. హైవేల వెంట ట్రామా కేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. కొత్తగా ఏర్పాటయ్యే ఆసుపత్రులతో పాటు ప్రస్తుతమున్న ఆసుపత్రుల్లో అవసరమైనంత మంది సిబ్బందిని, డాక్టర్లను నియమించాలని, అవసరమనుకున్న ప్రతీ పరికరాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. ప్రతీ జిల్లాలో కనీసం నాలుగు చోట్ల, మొత్తం తెలంగాణలో 40 చోట్ల ఎంఆర్ఐ, సిటి స్కాన్, అల్ట్రా సౌండ్, మెమోగ్రఫీ ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లాలోని భౌగోళిక, జనాభా అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ కేంద్రాలు ఏర్పాటు కావాలన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్ తదితర రోగాల నిర్ధారణకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. కిడ్నీ, లివర్ లాంటి అవయవాల మార్పిడికి అనుగుణంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు మెరుగు కావాలన్నారు. పెద్ద ఆసుపత్రుల్లో హెమోఫీలియా మందులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్ లోనే అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, రోగనిర్ధారణ చేయాలని చెప్పారు. ఆసుపత్రుల్లో సర్జికల్స్, డ్రగ్స్, రోజు ఉపయోగించే మందులు, పరికరాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. మందుల సరఫరాకు కూడా సరైన విధానం అవలంభించాలన్నారు. ఏ ప్రాంతంలో ఏ వ్యాధులు ఎక్కువగా ఉన్నాయో గుర్తించి, వాటికి అనుగుణమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ విషయాలను పరిగణలోకి తీసుకుని వైద్య, ఆరోగ్యశాఖకు ఎన్ని నిధులు కావాలో చెప్పాలని, వాటిని కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని సిఎం అన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు బాగా మెరుగు కావాలని, అందుకు అనుగుణమైన ఆచరణాత్మక విధానం అమలు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో (పీ.హెచ్.సి) విధులు నిర్వహించే వైద్యులకు అదనపు వేతనం ఇవ్వాలని, తాము పనిచేసే ప్రాంతాల్లోనే నివాసం ఉండాలనే నిబంధన కూడా తొలగించాలని, సమీప టౌన్ లో నివాసముండే వెసులుబాటు కల్పించాలని చెప్పారు. పీ.హెచ్.సిలలో డాక్టర్ల సంఖ్యను పెంచి, ప్రతీ డాక్టర్ ఖచ్చితంగా ఎన్ని గంటలు విధుల్లో ఉండాలో నిర్ణయించాలన్నారు. అప్పుడు డాక్టర్లకు వెసులుబాటు ఉంటుందని, రోగులకు ప్రజావైద్యం అందుతుందని సిఎం అభిప్రాయపడ్డారు. కేవలం విద్యార్థులే కాకుండా, ప్రభుత్వ వైద్యులంతా ఖచ్చితంగా గ్రామీణ ప్రాంతాల్లో కొంత కాలం పనిచేయాలనే నిబంధన పెట్టాలని చెప్పారు.

ఇతర శాఖల్లో ఏ ఉద్యోగి అయినా మరో శాఖలో పనిచేయవచ్చని, కానీ డాక్టర్ పని కేవలం డాక్టర్ మాత్రమే చేయగలుగుతారని సిఎం అన్నారు. కాబట్టి వైద్యులకు అవసరమైన పని పరిస్థితులు కల్పించి, వారి సేవలు పొందేలా విధానం ఉండాలన్నారు. ప్రజావైద్యం కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తున్నదని, ఆరోగ్య శాఖ కూడా

ఎంతో కష్టపడుతున్నదని, కానీ ప్రజలకు ఇంకా ప్రభుత్వ వైద్యశాలలపై నమ్మకం రావడం లేదన్నారు. ప్రైవేటు, కార్పొరేటు ఆసుపత్రుల్లో ఉన్నట్లే ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా మంచి బెడ్లు, బెడ్ షీట్లు, పరిశుభ్రమైన వాతవారణం ఉండాలని సిఎం వివరించారు. ప్రజలకు ఆరోగ్య స్పృహ పెరిగిందని, ఏ సమస్య వచ్చినా ఆసుపత్రులకు వస్తున్నారని, దానికి అనుగుణంగా ప్రజావైద్యం సిద్ధంగా ఉండాలన్నారు. గర్భిణీల ప్రసవ సమయంలో తమ కుటుంబీకులు కూడా వెంట ఉండే విధంగా ప్రత్యేక గది అందుబాటులోకి తేవాలన్నారు. అల్లోపతి తో పాటు ఆయుర్వేదం, హోమియో, యునాని వైద్యంలో కూడా మెరుగైన సేవలు అందించడానికి ఏమికావాలో అది చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ వైద్యశాలలకు ఏమి కావాలంటే అది ఇస్తామని, అంతిమంగా ప్రైవేటు ఆసుపత్రులకన్నా మెరుగ్గా అవి తయారు కావాలన్నారు.

ప్రజావైద్యంలో మెరుగ్గా ఉన్న తమిళనాడు రాష్ట్రంలో ఆరోగ్యశాఖ మంత్రి నాయకత్వంలోని బృందం పర్యటించి రావాలని సిఎం ఆదేశించారు. అక్కడ ఆసుపత్రుల నిర్వహణ, ప్రజావైద్యంలో వారు అమలు చేస్తున్న విధానాలు అధ్యయనం చేయాలని ఆదేశాంచారు. వైద్య ఆరోగ్య శాఖలో అధికారాల వికేంద్రీకరణ జరపాలని, నిధులను వినియోగించుకునే స్వేచ్ఛ ప్రతీ యూనిట్ ఇన్చార్జికి ఉండాలని సూచించారు. 108, 104 సేవలను మరింత బలోపేతం చేయడానికి అనువైన విధానం రూపొందించాలని, హైవేల మీద పెట్రోలింగ్ చేసే వాహనాలతో ఈ వాహనాలను కూడ అనుసంధానం చేయాలని చెప్పారు. ప్రమాదాలు సంభవించిన సమయంలో పోలీస్, ఆరోగ్య శాఖ సమన్వయంతో పనిచేయాలని డిజిపి అనురాగ్ శర్మకు చెప్పారు.

**సిపిఆర్ఓ టు సిఎం**